శ్రీకాకుళం

వెన్నెల రాత్రి

వెలుపల పాల వెన్నెల కురుస్తున్నది.

నేను జాగ్రత్తగా గది కిటికీలన్నీ మూసి, పక్కమీద మేనువాల్చి, ఏదో ఆలోచిస్తూ పడుకున్నాను.

ఇంతలోకే బాబు వచ్చి, "బాబాయి, బాబాయి! కిటికీలన్నీ చందురుణ్ణి చూడనివ్వకండా ఎందుకు మూశావు" అని తలవని తలంపుగా అడిగాడు.

చంద్రుణ్ణిగాని, వెన్నెల్నిగాని చూస్తే నాకు భయమని ఎల్లా చెప్పను? "చలిగా ఉంది బాబూ. అందువల్ల కిటికీలు మూసి వేసా"నని బొంకి తప్పించుకున్నాను. చంద్రకిరణాలు ప్రసరించని గదిలో బాబు ఉక్కిరి బిక్కిరైనాడు. వెంటనే తల్లి దగ్గరికి, విడిచిన తన చొక్కాని బండికిమల్లే లాగుతూ వెళ్లిపోయినాడు. ప్రపంచాని కంతటికీ ఆనందాన్నిచ్చే వెన్నెలకి నేను దూరమై, దాదాపు ఇరువయి సంవత్సరాలు దాటాయి. చీకటిలో జీవితం గడిపి చీకటినే ప్రేమించడం నేర్చుకున్నాను. వెన్నెల్ని చూస్తే, నాకు వెంటనే గుండెల్లో దడ ప్రారంభమవుతుంది. శరీరం కంపర మెత్తుతుంది. మెదడులో పాములు జెర్రెలు పరుగెత్తుతాయి.

ఎక్కడ చూచినా, రక్తపింజెరలు, నెమ్మదిగా నావేపు పాకుతూ వస్తున్నట్లు కనపడుతాయి. కొన్ని రక్తపింజెరలు లోపలివేపు ఇంటి కప్పుపైన పాకుతూ, పట్టు వదిలి చల్లగా నా శరీరంపైన పడుతాయి. నేను అమాంతంగా పక్కకి దూకుతాను. కాలు రక్తపింజెరపైన పడుతుంది. శరీరం

పైన ఇంకొక రక్తపింజెర, పట్టు వదిలి పడుతుంది. మతి చలించి, కెవ్వున కేక వేసి, నేను రక్తపింజెరల పైన పడుతాను. అవి చితికి పోతాయి. అంతే ఆ తరువాత ఏమీా జ్ఞాపకం ఉండదు.

ఈ యమయాతన పడడానికి బదులు, జీవితంలో వెన్నెలతో తెగతెంపులు చేసుకున్నాను. చీకటిని వరించి, ప్రేమించి, చీకటిలోనే, చీకటితో కాపురం చేయడానికి నిశ్చయించుకున్నాను.

దీని కంతటికీ, కారణ మేమిటని మీారు అడుగవచ్చు. నా భీరుత్వానికి మీారు నన్ను అవహేళన చేయవచ్చు. అదిగో, అప్పుడే మీారు నా పిరికితనాన్ని చూచి నవ్వుతున్నారు. వెన్నెల్ని చూచి భయపడట మేమిటని, గొల్లుమంటున్నారు. తొందర పడకండి. నా జీవిత గాథ సావధానంగా వినండి. అప్పటికీ మీాకు నవ్వువస్తే నవ్వండి, అవహేళన చేయడం సమంజసంగా తోస్తే, అవహేళన చెయ్యండి. అంతేకాని వినకుండా గొల్లు మనకండి.

*　　　*　　　*

అది వెన్నెల రాత్రి. ఆ వెన్నెల రాత్రి నా జీవితంలో నేను ఎప్పుడూ మరిచి పోలేను. ప్రపంచమంతా వెన్నెల దుప్పటి కప్పుకొని నిశ్శబ్దంగా పడుకున్నది. ఎక్కడా గురకలు లేవు. ఆవలింతలు లేవు. మత్తుమందు చల్లినట్లు, సకల ప్రాణికోటి నిద్రిస్తున్నది. ఎక్కడా చెట్లపైన ఆకులు కూడా కదలడం లేదు. ఎందుకో, ఆ రోజు నాకు నిద్ర పట్టలేదు. పక్కమీాద దొర్లుతూ కాలక్షేపం చేస్తున్నాను. రాత్రి దాదాపు రెండు గంటలై ఉంటుంది. ఇంట్లో అందరూ

పడుకున్నారు. నా కేమీ తోచలేదు. పక్కమీదనుంచి లేచి వెన్నెల్లో కూర్చుందామని దొడ్డి తలుపు తీశాను. వేప ఆకుల్లోంచి వెన్నెల రూపాయి బిళ్ళల్లా పడుతున్నది. ఆ రూపాయి బిళ్ళలని చూస్తూ, దొడ్లో కూచున్నాను. ఇంతలోకే ఏదో అలికిడైంది. నేను లక్ష్యం చేయలేదు. మచ్చుమందు ప్రభావం క్రమంగా తగ్గిపోతున్నదేమో ననుకున్నాను— గోడ అవతల ఏదో ప్రాణి మేల్కొని ఉంటుంది. అదుగో, ముంగురులు కనపడుతున్నాయి. పర్వతాలు, అరణ్యాలు, సముద్రాల వెనకాల ఉదయించే చంద్రుడికి మల్లే గోడచాటు నించి ఒక మొహం, పైకి లేచింది. నాకు అమాంతంగా గుండెదడ ఆగి పోయింది. భయంతో శరీరం కంపరమెత్తింది.

ఒక మానవాకారం గోడమీదికి పాకి, లోపలికి దిగుతున్నది. తెల్లని చీర, ఎర్రటి అంచు తెల్లని పట్టు రవిక. నొసట ఎర్రని కుంకుమ. దూరంగా వెన్నెలలో మొహం పోల్చుకోలేక పోయాను. తెల్లని చీర నా వేపు నడిచి వస్తున్నది. కుంకుమ బొట్టు పాల వెన్నెలలో అరుణ కాంతుల్ని విరజిమ్ముతున్నది. కనుచూపు మేరలోకి వచ్చేసరికి తెల్ల చీర సిగ్గుతో తల వాల్చుకుంది — ఎవరు? మా పక్కింటి అమ్మాయి లక్ష్మి. నా కళ్ళని నేనే నమ్మలేక పోయినాను. నేను ప్రేమించి, కామించిన లక్ష్మి — చివాలున గంతువేసి, నా లక్ష్మిని నా బాహువుల్లో బంధించి ఉక్కిరి బిక్కిరి చేశాను. లక్ష్మి ఇంక సందేహం లేదు. పాము ఆకారంలో లక్ష్మి నొసటి బొట్టు జిగేలు మంటున్నది. ఎందుకో, ఆ వళ్ళు తెలియని ఆ వేళంలో, ఆ బొట్టుని ముద్దు పెట్టుకున్నాను. ఆనంద పారవశ్యానికి లక్ష్మి బుగ్గలు, సొట్టలు పడ్డాయి.

ఆ సొట్టల్లో వెన్నెల నీళ్ళు నిండుకున్నాయి. ఆ వెన్నెల గుంటల్ని తనివి తీరా ముద్దు పెట్టుకున్నాను. నా శరీరమే వెన్నెలగా మారి, లక్ష్మి శరీరాన్ని పెన వేసుకున్నది. ఇంక ఆ రాత్రికి నాకు, వెన్నెలా, లక్ష్మి, వేప చెట్టూ మిగిలి పోయినాయి. ప్రపంచంలోని తక్కిన వస్తువులన్నీ కళ్ళల్లోంచి అదృశ్య మైనాయి. ఆ తరువాత నాకు వెన్నెలలు, వెన్నెల రాత్రులు మాత్రమే మిగిలాయి. సూర్యుడు ఉదయిస్తున్నదీ, అస్తమిస్తున్నదీ నాకు తెలియదు. వెన్నెల వస్తుంది. వెన్నెలతో, వెన్నెలలో, వెన్నెల బాల తెల్లటి చీరతో ఆడు కుంటాను. అంతే, పక్షం రోజులు గడిచాయి. వెన్నెలతో మేమూ ఉదయించే వాళ్ళం. వెన్నెలతో మేమూ అస్తమించే వాళ్ళం. ఆ రోజు ఇక వెన్నెలకు ఆఖరు రోజు. "రేపటి నుంచీ, నేను రాలేను. నాకు చీకటి అంటే భయ" మని, నా ఒళ్ళోని వెన్నెలబాల పలికింది. నాకు నిలువునా ముచ్చెమ టలు పోశాయి. పెదిమలు బెంగతో, ఆ వెన్నెల కాంతిలో ఎండి పోయినాయి.

"నేను ఉన్నానుగా నీకేమి భయమని" నచ్చ చెప్పాను.

"లేదు. నేను చీకటిలో ఇంటి వెలుపలికి రాలే" నని నా వెన్నెల బాల నిక్కచ్చిగా చెప్పింది. ఆ తరువాత పది హేను రోజులు నా జీవితంలో చీకటి వెలిసింది. అప్పట్లో ఒక్కసారి అయినా కాలకృత్యాలకు తప్ప గది వెలుపలికి రాలేదు. చీకట్లతో చెలగాటం ప్రారంభించాను. చీకటికి సన్ని హితం కావటం మొదలెట్టాను. రాత్రిళ్ళు గదిలో దీపం పెట్టుకునేవాణ్ణి కాను. చీకటి ముసుగుతో, సందె చీకటిలో పక్కపైన మేను వాల్చేవాడిని. తెల్లవారింది, మధ్యాహ్నె

మైందీ, చీకటిపడిందీ, ఆ ఐచ్ఛిక ప్రవాసంలో తెలియక పోయేది. జీవితంలో చీకట్లతరువాత వెన్నెలలు విరిసేవి. వెన్నెల తరువాత చీకట్లు మూగేవి. జీవితానికి చీకట్లు, వెన్నెలలు, కొండగుర్తులుగా మారాయి.

రోజులు, మాసాలు, వెన్నెలలు, చీకట్లమధ్య గడిచి పోతున్నాయి. వెన్నెలబాల, చీకట్లలో కనపడక పోవటం ఆశ్చర్యంగా తోచేది. చీకటి అంటే నిజంగా భయమేమో పోనీ, నేనే చీకట్లల్లో, గోడదాటి ఆ యింటికి వెడితే? వెన్నెల బాలతో ఆ సంగతి అడిగి చూచాను. "వద్దు, మా ముసలమ్మ, రాత్రిళ్ళంతా మేల్కొని వుంటుందని చెప్పింది, దానితో, నాకు చీకట్లు, చీకట్లుగా నిలిచాయి. వెన్నెలలు, చీకట్లమధ్య మరికొన్ని మాసాలు గడిచాయి,

ఒకరోజు ఉదయం అమ్మ, నా గదిలోకి కాఫీ తీసుకొచ్చింది. కాఫీ చల్లారుస్తూ "ఏంరా! రోజుకు రోజు అల్లా చిక్కిపోతున్నావు?" అని అడిగింది. అప్పట్లో నా కవి చీకటి రోజులు. చీకటి రోజుల్లో, బెంగతో చిక్కిపోయినానేమోనని, నేను మెదలకుండా వూరుకున్నాను. ఆ తరువాత, మా యింట్లో అందరూ, నన్ను చిక్కిపోతున్నావని అనడం పరిపాటి అయిపోయింది. గోరెదాటు జనం, ఒకరు చిక్కిపోతున్నావంటే, మిగిలిన వారంతా శ్రుతికలిపి, "చిక్కిపోతున్నావు, చిక్కిపోతున్నావు" అని స్వరమేళతో పలకడం సహజం. ఆ మాటల్ని నేను ఎప్పుడూ లక్ష్యం చేయలేదు.

నా ధ్యాస అంతా, ఆ రోజుల్లో ఒక్క వెన్నెలబాల పైననే కేంద్రీకరించి వుండేది! ఇతరమేమీ నాకు కనపడేది కాదు. కాగా అది నా ప్రేమ ప్రభావమని గర్వించేవాడిని.

చీకట్లు, వెన్నెలల మధ్య మరి మూడు మాసాలు గడిచాయి. ఒకరోజు ఉదయం, నేను పెరట్లో మొహం కడుక్కుంటున్నాను. అమ్మ తన ధోరణిలో, "లక్ష్మి తల్లికి పక్షవాతం వచ్చింది. పదిహేను రోజులైంది, పట్నం తీసుకెళ్ళా"రని ఆ రోజు ఉదయమే వచ్చిన మా అమ్మమ్మకు చెబుతున్నది.

రోజూ నేను, అవి వెన్నెల రాత్రులు కావడంవల్ల, లక్ష్మిని కలుసుకుంటూనే వున్నాను. కాని ఆ సంగతి లక్ష్మి నాకెన్నడూ చెప్పలేదు.

"లక్ష్మి ఇక్కడే వుందా?" అని అమ్మమ్మ అడిగింది.

"నీదంతా విచిత్రం, తల్లి చావుబతుకుల్లో వుంటే లక్ష్మి ఇక్కడ ఎందుకు వుంటుందని?" అమ్మ అమ్మమ్మని ఎదురు ప్రశ్న వేసింది.

"గడచిన ఎనిమిది రోజులనుంచీ, రోజూ లక్ష్మి నన్ను కలుసుకుంటున్నది. వీళ్ళకేమైనా మతులు పోలేదు కదా" అని నాకు ఆశ్చర్యమేసింది.

"లక్ష్మి ఇక్కడే ఉన్నట్లుందే. నిన్న సాయంత్రము కనబడినట్లు నాకు జ్ఞాపకం."

అమ్మతో పాటు నీకుకూడా మతిపోయిందేమిటిరా?"

ఆ ప్రశ్నకు నే నేమీ సమాధానం చెప్పలేదు. ముళ్ళమీద కూర్చొని రాత్రికోసం ఎదురుచూచాను. హృదయంలో ఒక విధమైన ఆందోళన, భయం లక్ష్మి తల్లిని గూర్చి ప్రారంభమైంది. తల్లితో వెడితే, మొదటి ఎనిమిది రోజులు వెళ్ళి ఉంటుంది. ఆ తరువాత వచ్చేసి వుంటుందనుకున్నాను. ఈ రోజు ఉదయమే, "కుర్రవాడు ఎందుకో పాలిపోతున్నా

డేమిటే'' అని మా అమ్మమ్మ అమ్మని అడగటం విన్నాను. నిజంగా పాలిపోతున్నానేమోనని అనుమానం వేసి, అద్దంలో మొహం చూచుకున్నాను, పాలిపోవడం ఏమిటో తెలియలేదు కాని, కళ్ళు లోపలికి పీక్కుపోయినట్లు కనపడ్డాయి. రాత్రిళ్ళు నిద్రలేకపోవడం వల్ల కళ్ళు లోపలికి పీక్కుపోయిన వని, నాకు నేనే సమాధానం చెప్పుకున్నాను.

వెన్నెల వచ్చింది, వెళ్లి దొడ్లో కూర్చున్నాను. గోడ వెనకాలనుంచి చంద్రుడు ఉదయిస్తున్నాడు. ఉద్రేకంగా వెళ్లి చంద్రుడిని శరీరంతో కప్పేశాను. ''మీ అమ్మకి జబ్బుగా వుంటే నాతో చెప్పలేదేం?'' అని లాలనగా తల పైకెత్తి అడిగాను — ఎందుకో నొసటిలోని పాము రక్త వర్ణంతో బుసలు కొట్టినట్లు తోచింది నాకు.

భ్రమ వట్టి భ్రమ — బొట్టు ఎక్కడైనా బుసలు కొడుతుందా? వెన్నెల బాల సమాధానం ఏమీ చెప్పలేదు. ''పొరపాటు జరిగింది. క్షమించండి'' అన్నట్లు నా కళ్ళలోకి చూచింది. నెమ్మదిగా వెన్నెల బాలను, వేపచెట్టు నీడల్లోకి తీసుకెళ్ళాను. ఎందుకో ఆ రోజు ఎక్కడా వేపచెట్టు క్రింద వెన్నెల బాల ఎందుకో నా చేతుల్లోంచి తప్పించుకొని వెన్నెల లోకి వచ్చేసింది. ''ఎందుకల్లా వచ్చేశావు'' అని అడిగితే, ''నాకు నీడలు, చీకట్లంటే భయ''మని చెప్పింది. ఆ రాత్రి తిరిగి మేము వేపచెట్టు కిందికి వెళ్ళలేదు. వెన్నెల్లోనే కాల క్షేపం చేశాము. ఉదయం లేచీ లేవడంతోనే ''లక్ష్మి ఇక్కడ లేదన్నావు, ఇక్కడే వుంది కదే'' అని మా అమ్మతో అన్నాను. ''పదిహేను రోజుల నించి వాళ్ళ యింటికి తాళం

వేసివుంటే, లక్ష్మి ఇక్కడ వుండట మేమిటిరా?'' అని అమ్మ నన్ను ఎదురు ప్రశ్న వేసింది.

''ఈ మధ్య వచ్చి ఉండగూడదా?''

''నేను చెబితే నీకు నమ్మకంలేదు. నువ్వే వెళ్ళి ఆ యింటికి తాళం వేసివుందో లేదో చూచిరా?''

నాకు శరీరంపైన బిందెడు చన్నీళ్ళు పోసినట్లయింది. ఆపాదమస్తకం వణుకుతూ, లక్ష్మి యింటికి వెళ్ళాను. యింటికి తాళంవేసి వుంది. నాకళ్లని నేనే నమ్మలేక పోయాను. భయంతో శరీరం వణకడం, సలసల కాగడం మొదలెట్టింది. జ్వర మొచ్చినట్లు తోచింది. ఆ జ్వరంతోనే యింటికి తిరిగి వచ్చాను. ఎన్ని గొంగళ్ళు, రగ్గులు కప్పుకున్నా చలి ఆగలేదు.

ఆనాడు కూడా వెన్నెలరాత్రే. గది కిటికీలు మూసి లేవు. అమ్మ నాపక్కనే పడుకొని వుంది. కిటికీలోంచి ఎందుకో నేను వెన్నెల వేపు చూచాను. కిటికీకి అవతల వెన్నెలబాల వెలిసింది. నేను ఆమెను చూడటంతోనే, కెవ్వున కేక వేశాను. అమ్మ చప్పున మేల్కొని ''ఏమిటి, ఏమిటి'' అని అడిగే లోపున అదృశ్యమైంది. నాకు స్మారకం తప్పింది. అపస్మారక స్థితిలో, కిటికీ వేపు చూతును కదా, వెన్నెలబాల గొల్లున నవ్వుతున్నది. వెన్నెలలోకి రమ్మని నన్ను ఆహ్వానిస్తున్నది. నేను భయంతో, రగ్గు కప్పుకోవడానికి ప్రయత్నిస్తుండగా, ఆమె నొసట్లోని పాము రక్తపింజెరగా మారింది. అది వందలాది రక్తపింజెరలను సృష్టిస్తున్నది. గది నిండా

రక్తపింజెరలు వికటాట్టహాసం చేస్తున్నాయి. శరీరంపైన పైనుండి పడుతున్నాయి. చేతులపైన, కాళ్ళపైన, కడుపుపైన పాకుతున్నాయి. మెడపైన పాకి గొంతు నులిమివేస్తున్నాయి. మెదడులో ప్రవేశించి నాస్మృతిని నాశనం చేస్తుండగా "అమ్మా ఆ కిటికీ తలుపులు వేసెయ్య"మని గట్టిగా చీత్కారం చేశాను. అంతే—ఆ తరువాత ఏమి జరిగిందో నాకు తెలియదు.

అది మొదలు నాకు వెన్నెలంటే, భయం. చీకటి రాత్రుళ్ళలో ఏమీ భయంలేకుండా ఎక్కడికిపడితే అక్కడికి వెడతాను. కాని వెన్నెలరాత్రిళ్ళల్లో, సాయంత్రం కావడం తోనే, గదిలోంచి ఎక్కడికీ కదలను. పైగా వెన్నెలనికూడా గదిలోకి చొరనివ్వకుండా, కిటికీతలుపులన్నీ బంధించివేస్తాను.

★